క్లుప్తంగా

సమయపాలన పాటించాలి



పాన్‌గల్: విద్యార్థులు, ఉపాధ్యాయులు తప్పక సమయపాలన పాటించాలని ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యపై తల్లిదండ్రులకు వివరిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు.

యూనిఫాం సకాలంలో అందించాలి



పాన్‌గల్: విద్యార్థులకు అందించే యూనిఫామ్‌లను త్వరగా కుట్టి సకాలంలో అందించాలని ఐకేపీ ఏపీఎం సక్రూనాయక్ మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో రెండో విడతలో వచ్చిన విద్యార్థుల యూనిఫాం బట్టను సంబంధిత సంఘం సభ్యుల్లో కత్తరించే వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో ఒక్కొక్క జత మాత్రమే విద్యార్థులకు అందజేశారన్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో మొత్తం 50 పాఠశాలలకు సంబంధించి 3,210 మంది విద్యార్థులకు యూనిఫామ్స్‌ను కుట్టేందుకు అవసరమైన బట్టను అందజేశామన్నారు. కార్యక్రమంలో సీసీ నాగరాజు, కార్యాలయం అకౌంటెంట్ అనిత, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం



పెబ్బేరు రూరల్: వనపర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్‌గౌడ్‌కు పెబ్బేరు మండల గౌడ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. మండలంలో కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విక్రంగౌడ్, కృష్ణయ్యగౌడ్, సీతారామన్‌గౌడ్, నాగరాజుగౌడ్, రమేష్‌గౌడ్, బీచుపల్లిగౌడ్, రామన్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



మదనాపురం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు సోమవారం స్థానిక వైద్యురాలు డాక్టర్ భవాని ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. జ్వరం, జలుబు ఉన్న విద్యార్థులకు మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల, ఎస్ఓ రేణుక, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐకి సత్కారం



ఆత్మకూర్: ఇటీవలే ఆత్మకూర్ ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రావణ్‌కుమార్‌ను సోమవారం సిబ్బంది సన్మానించారు. కృష్ణ చెక్‌పోస్టు సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్‌కుమార్ ఆత్మకూర్ సీఐగా అదనపు బాధ్యతలు చేట్టినట్లు సిబ్బంది తెలిపారు. సీఐను సత్కరించినవారిలో హర్షవర్ధన్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

స్థలం పరిశీలన

కొల్లాపూర్: వరిదేల శమీవృక్షం వద్ద నూతనంగా చేపట్టనున్న మండపం నిర్మాణ స్థలాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనులపై శమీవృక్ష కమిటీ సభ్యులతో చర్చించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్లు మేకల శిరీషయాదవ్, నయూమ్, ఎక్బాల్, కృష్ణమనాయుడు, కేతూరి ధర్మతేజ, సురేందర్‌సింగ్, ఎల్లాగౌడ్, దిలీప్‌శెట్టి ఉన్నారు.

గాలి వీచిందో.. విద్యుత్ కట్



గుమ్మడం సబ్‌స్టేషన్

- గ్రామాల్లో వేలాడుతున్న వైర్లతో ఇబ్బందులు
- చిరు జల్లులు కురిసిస్తే అంతే
- పట్టించుకోని అధికారులు

పెబ్బేరు రూరల్: ప్రభుత్వం వ్యవసాయానికి, గృహ వినియోగానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. పెబ్బేరు, శ్రీరంగాపురం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అది అమలు కావడం లేదు. చిరుగాలి, చిన్నపాటి జల్లులకు సైతం విద్యుత్ నిలిచిపోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే కరెంట్ పోయిందంటే తెల్లవారే వరకు దాని గురించి పట్టించుకునే నాథుడే లేడు. ఉమ్మడి మండలంలో పెబ్బేరు, శ్రీరంగాపురం, అయ్యవారిపల్లి, కంచిరావుపల్లి, సూగూరు, గుమ్మడం సబ్‌స్టేషన్ల నుంచి అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతుంది.

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం

స్తంభాల మధ్య విద్యుత్ వైర్లు వేలాడుతున్న విషయం ట్రాన్స్‌కో అధికారులకు తెలిసినా వారి పట్టించుకోవట్లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వైర్లు ఒక దానికి ఒకటి కలిసి పోవడం, పంట పొలాలు, గ్రామంలో విద్యుత్ వైర్ల మీద చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో కారణంగా అవి తగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. మళ్లీ తిరిగి సరఫరా చేయడానికి ప్రయతి్నంచినా ట్రిప్ కావడంతో ఇబ్బంది తప్పడం లేదు. దీనికి తోడు శిథిలావస్థ స్తంభాలు వేధిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమైనందున దోమల బెడద పెరగడంతో రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

నారుమడులకు నీటి ఎద్దడి

ప్రస్తుతం వరి నారుమడులు పోసుకునే సమయం కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు అంతంతమాత్రంగానే కురుస్తున్న నేపథ్యంలో నారుమడులకు నీరు అందించేందుకు నిరంతరం విద్యుత్ అందించాలని అన్నదాతలు కోరుతున్నారు. ఉమ్మడి మండలంలో 28 గ్రామాలు, పెబ్బేరు మున్సిపాలిటీ ఉంది. శ్రీరంగాపురం మండలంలో ఒక జేఎల్ఎం, ఒక ఎల్ఐ పోస్టు, పెబ్బేరులో ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో సిబ్బందికి పని ఒత్తిడి పెరగడంతో సమస్యలు పరిష్కరించడంలో ఆలస్యం అవుతుందని ట్రాన్స్‌కో అధికారులు అంటున్నారు. గ్రామానికి ఒకరి చొప్పున సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

వ్యవసాయానికి 24గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్తున్నా క్షేత్రస్థాయిలో కోతలతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం నారుమడులు పోసుకోవాలంటే భయమేస్తోంది. చిన్నపాటి గాలి వచ్చినా కరెంట్ తీసేస్తున్నారు. దీంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించిన వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలి.

– మోహన్‌గౌడ్, బునాదిపురం

చెట్ల కొమ్మలు తొలగించాలి

స్తంభాల కింద చెట్లు ఎత్తుగా పెరగడంతో కొమ్మలు వైర్లకు తగిలి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. రాత్రి సమయంలో విద్యుత్ పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వేలాడుతున్న వైర్లను సరిచేయాలి.

– ధర్మ వెంకటాపురం

చావిడీల్లో కొలువైన ఆలంలు

అమరచింత: మొహర్రం నెల మొదటి రోజును పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లోని పీర్ల చావిడీల్లో ఆలంలు (పీర్లు) కొలువుదీరాయి. పది రోజుల పాటు గ్రామాల్లో ప్రజలు కులమతాలకు అతీతంగా మతసామరస్యం ఉట్టిపడేలా పీర్ల పండుగను సామూహికంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. పీర్ల పండుగ మొదలైన ఐదో రోజు నుంచి ప్రతి నిత్యం ఒక ఆలంను ఊరేగిస్తారు. మోహర్రం ఐదో రోజు తానే అబ్దుల్లా ఆలం, ఆరో రోజున అబ్బాసలీ ఆలం, ఏడో రోజున ఇమామే ఖాసీం ఆలం, ఎనిమిదో రోజు అలీ అక్బర్ ఆలం, తొమ్మిదో రోజు ఇమామే ఉస్సేన్ ఆలం సవారీ వేడుకలు నిర్వహిస్తారు. మండల కేంద్రంలో ఇమామే ఉస్సేన్ సవారీ వేడుకలు ఉమ్మడి జిల్లాలో పేరుగాంచింది. ముస్లిం కుటుంబాలు మోహర్రం పది రోజులు సంతాప దినాలుగా పాటిస్తారు.



అమరచింత పెద్ద మసీదులో కొలువుదీరిన ఇమామే ఉస్సేన్ ఆలం, బీబీ ఫాతిమా అలం

పీర్ల మసీద్ స్థలాన్ని కాపాడాలి

అమరచింత: పట్టణంలోని పదో వార్డులోని బుడుకల వీధిలో ఉన్న అడ్డాకుల ఖాసీం పీర్ల మసీదు శిథిలమై కొన్నేళ్లుగా ఖాళీగా ఉంది. దీంతో ఆ స్థలాన్ని కొంతమంది కబ్జా చేయడానికి యత్నించారంటూ మున్సిపల్ కమిషనర్‌కు ముస్లిం కమిటీ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా పట్టణ ముస్లిం కమిటీ సభ్యులు మాట్లాడుతూ పీర్ల మసీదు ఖాళీ స్థలాన్ని కొందరు గ్రామ పంచాయతీ నుంచి అనుమతి ఉందని తప్పుడు పత్రాలతో మసీదు స్థలంలో ఇంటి నిర్మాణం కోసం ప్రయత్నించడం ఎంత వరకు సమంజసం అన్నారు. బుడుకల వీధిలోని అడ్డాకుల మసీదు స్థలం ఇతరుల చేతిలో కబ్జాకు గురికాకుండా అక్రమాలకు పాల్పడిన సదరు వ్యక్తులపై చర్యలు తీసుకొని మసీదు స్థలాన్ని కాపాడాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం మాట్లాడుతూ సమగ్రంగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తౌఫిక్, పాషా, ఆశ్వక్, బడేసా, నబి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం కమిటీ సభ్యులు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

పాన్‌గల్: వర్షాకాలంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని దావాజిపల్లిలో పర్యటించి పంచాయతీ రికార్డులు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం చర్యలు ప్రతి నిత్యం నిర్వహించాలని, తాగునీటి పైపులైన్ల లీకేజీలు లేకుండా చూసుకోవాలని, చెత్తను ఇష్టానుసారంగా కాలనీల్లో పారవేయకుండా చెత్త ట్రాక్టర్ వచ్చినప్పుడు ట్రాక్టర్‌లో వేసేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జీపీ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

కేసు నమోదు

అమరచింత: ఇంటి ఎదుట బాత్‌రూంకు సంబంధించిన పైపు బయటకు వచ్చిందంటూ మంగ్యానాయక్, బద్యానాయక్ కుటుంబాలు ఘర్షణకు పాల్పడటంతో ఇద్దరి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశామని ఎస్ఐ సురేష్ తెలిపారు. చంద్రనాయక్ తండాకు చెందిన మంగ్యానాయక్, బద్యానాయక్ బాత్‌రూంకు చెందిన పైపు బయటకు వచ్చిందనే కారణంతో గొడవలు పెట్టుకుని ఒకరినొకరు కొట్టుకున్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఆత్మకూర్: మండలంలోని ఆరేపల్లికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిని రాని ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలు.. ఆరేపల్లికి చెందిన బుచ్చన్న ఏడాది క్రితం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఇతడికి మూర్ఛవ్యాధి ఉందని, ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో భార్య లక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలసిన వారు 87126 70631 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మల్లికార్జున్‌యాదవ్‌కు డాక్టరేట్



పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన ఎనుమల మల్లికార్జున్‌యాదవ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. భూగర్భ జలాల మూల్యాంకనం, గోవర్ధనగిరి వాగు ఏరియా, వనపర్తి జిల్లా–తెలంగాణ, ఇండియా అనే అంశంపై జియాలజీ డిపార్టుమెంట్‌లో ప్రొఫెసర్ పాండురంగారెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ వచ్చినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కుటుంబానికి చెందిన ఎనుముల నాగమ్మ, ఎనుముల రాములు దంపతుల కుమారుడైన మల్లికార్జున్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. ఉన్నత చదు వులు చదవడానికి హైదరాబాద్‌కు వెళ్లి ఉస్మానియా యూనివర్సిటీలో జియాలజీలో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశాడు.

వైఎస్సార్ ఆశయాలు కొనసాగిద్దాం



పెద్దగూడెంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలోని నిరుపేదల బతుకులకు భరోసా కల్పించిన మహానేత వైఎస్సార్ సేవలను ఎన్నటికీ మరువరానివని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎంతో సాహసోపేతంగా ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో వైఎస్సార్ చెరగని ముద్రవేశారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 104 సర్వీస్‌లను, పావలా వడ్డీ రుణ పథకాలను వనపర్తి నుంచే వైఎస్సార్ ప్రారంభించడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్, మున్సిపల్ చైర్మన్ మహేష్, టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పెంటన్నయాదవ్, శ్రీనివాసులు, ఐ.సత్యారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి, రాములు యాదవ్, ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, విండో చైర్మన్ కోదండరామిరెడ్డి, పరమేష్, రహ్మతుల్లా, నల్గొండ శ్రీను, విజయ్‌కుమార్, గంజాయి రమేష్, పర్వతాలు, పీఏసీఎస్ అధ్యక్షుడు రఘుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో..



ఆత్మకూర్‌లో..



రేవల్లిలో..

కేఎల్ఐ కాల్వకు మరమ్మతు చేపట్టాలి



కేఎల్ఐ కాల్వను పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా నాయకులు

పాన్‌గల్: కేఎల్ఐ కాల్వలో పేరుకపోయిన జమ్ము, మట్టిని తొలగించి చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, గిరిజన సంఘం జిల్లా నాయకులు బాల్యానాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా పరిసరాలల్లోని కేఎల్ఐ కాల్వను తండా రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడేరు మండలంలోని నాగులపల్లి, మైలారం నుంచి కేఎల్ఐ డీ 1 కాల్వ నీరు తెల్లరాళ్లపల్లితండాలోని చివరి ఆయకట్టుకు సక్రమంగా సరఫరా కాక ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేటికీ కాల్వలో పేరుకపోయిన జమ్ము, మట్టిని తొలగించకపోవడంతో సాగునీరు చివరి ఆయకట్టుకు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తండా వరకు కాల్వను పరిశీలించి జమ్ము, మట్టిని తొలగించడం, కాల్వ విస్తరణను పెంచి లై నింగ్ పనులు చేపట్టి సాగునీరు చివరి ఆయకట్టుకు సాఫీగా అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమస్యపై మంత్రి జూపల్లి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో తోరియానాయక్, బాబునాయక్, బాషానాయక్, శంకర్‌నాయక్, రవినాయక్, ధర్మనాయక్, బాల్యానాయక్, కృష్ణనాయక్ , రైతులు పాల్గొన్నారు.

గృహజ్యోతి దరఖాస్తులకు పోటెత్తిన జనం

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గృహజ్యోతి దరఖాస్తులు చేసేందుకు సోమవారం జనం పోటెత్తారు. గతంలో ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులల్లో చాలా మందికి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లు జీరో రాకపోవడంతో వారందరూ మళ్లీ దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనికి అనుగుణంగా పథకం వర్తించని వారందరూ ఎంపీడీఓ కార్యాలయంలో మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారని ఎంపీడీఓ కోటేశ్వర్ తెలిపారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుకు సంబంధించిన రశీదుతో పాటు ఆధార్‌కార్డు, విద్యుత్ బిల్లు, రేషన్‌కార్డు, గ్యాస్ బుక్ జిరాక్స్ కాపీలతో కార్యాలయంలో అందజేస్తే ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.



పాన్‌గల్ ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు ఇచ్చేందుకు గుమికూడిన జనం

ఎమ్మెల్యేపై బురద చల్లే రాజకీయం తగదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: మక్తల్ నియోజక వర్గానికి రూ.40 కోట్లు తీసుకొచ్చి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ హితువు పలికారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కేవలం రెడ్డి సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడినట్లు ఫేక్ వార్తలు సృష్టించి సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్‌ల్లో షేర్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా నియోజక వర్గంలో అన్ని వర్గాల ప్రజల ఆదరణతో ఎమ్మెల్యేగా గెలుపొందిన వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కకూడదనే ఉద్దేశ్యంలో ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. అలాంటి వ్యక్తులకు తగిన బుద్ధి చెప్పుతామన్నారు. సమావేశంలో శ్యామ్, ప్రకాశం, పోషిరిగారి విష్ణు, హన్మంతు నాయక్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాకిటిపై విష్రప్రచారం మానుకోవాలి

ఆత్మకూర్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అందరివాడని, ఆయనపై కొందరు పనిగట్టుకుని విష్రప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద మండల స్థాయి నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి అన్నివర్గాలను కలుపుకొని ముందుకెళ్తున్నారని, ఇది వరకే రూ.40కోట్లు తీసుకొచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. కొందరు పనిగట్టుకుని సోషల్ మీడియాలో ఎమ్మెల్యే రెడ్డి వర్గానికి వ్యతిరేకమంటూ పోస్టుల పెడుతూ విష్రప్రచారానికి పూనుకుంటున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పరమేష్, రహ్మతుల్లా, నల్గొండ శ్రీను, తులసీరాజ్‌యాదవ్, గాడికృష్ణమూర్తి, గణేష్, వీఎస్‌రావ్, గడ్డం శ్రీనివాస్, ఈర్లదిన్నె శ్రీను, ఎస్టీడీశ్రీను, వెంకటేష్, నాగేష్, దాము, రమేష్, పాష, మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

కొత్తకోట రూరల్: మండలంలోని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణగుప్త, సతీష్ కుమార్, శ్యామల, ప్రభారాణి, సుచరితకు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామస్తులు సోమవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఇతర పాఠశాలల నుంచి పాలెం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సుదీర్ఘకాలం పాటు పనిచేసి తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. ఎక్కడ పనిచేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు తమ సొంత పిల్లల మాదిరిగా భావించాలని అప్పుడే ఉపాధ్యాయులపై, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ కవిత, తపస్ జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు లోకారెడ్డి, సత్యనారాయణ, ఎంఎం బేగ్, అనిజ, ఊర్మిళ, సురేందర్, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పాలెం జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచరులు



ఆరుబయటే మధ్యాహ్న భోజనం

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఆరు బయట కూర్చొని భోజనాలు చేస్తున్న పరిస్థితులు దాపరించాయి. పాఠశాలకు డైనింగ్ హాల్ కోసం నిధులు మంజూరు చేయగా.. కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ నిధులు లేవని తెలియడంతో పనులు మధ్యలోనే వదిలేశారు. పాఠశాలలో మిషన్ భగీరథ నీరు రెండు, మూడు రోజులకు ఒకసారి బంద్ కావడంతో మున్సిపల్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. విద్యార్థులకు డైనింగ్ హాల్‌తో పాటు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

